

బోనం.. వైభవం

కుత్బుల్లాపూర్‌లో కనుల పండువగా బోనాల జాతర

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆదివారం బోనాల జాతర కనుల పండువగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయాలకు పోటెత్తారు. మహిళలు ఇంటి వద్ద బోనాలతో బైలెల్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఫలహారం బండ్ల వద్ద పోతరాజుల విన్యాసాలతో అక్కడ ఉన్న భక్తుల్లో ఉత్సాహం నింపారు. జానపద పాటలతో అమ్మవారి ఆలయాల పరిసరాలు మార్మోగాయి. ఎమ్మెల్యే వివేకానంద్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

– కుత్బుల్లాపూర్ జోన్ బృందం


బోనాలతో చిట్టితల్లులు


ఎస్‌ఆర్‌నయక్‌నగర్‌లో అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు


పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయం వద్ద బోనంతో మహిళలు


కుటుంబసమేతంగా బోనంతో వస్తున్న మహిళ


చింతల్ డివిజన్ వల్లభాయ్ పటేల్ నగర్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మల్లారెడ్డి


రంగారెడ్డి నగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలో భక్తులు



పద్మనగర్ ఫేజ్ 2లోని గీతంజాలి పాఠశాలలో చిన్నారుల బోనాల సంబురాలు


నిజాంపేట్‌లో ఎల్లమ్మ దేవాలయంలో మహిళలు బోనాలతో


రంగారెడ్డి నగర్ డివిజన్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్


టీఎస్ఐఐసీ కాలనీలోని నల్లపోచమ్మను దర్శించుకుంటున్న కూన శ్రీశైలంగౌడ్



జగద్గిరిగుట్ట సోమయ్యనగర్‌లో పూజలో పాల్గొన్న కార్పొరేటర్ జగన్


బాచుపల్లిలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ కాసాని సుధాకార్, కాసాని వీరేశ్




బౌరంపేట్ గ్రామంలో బోనాలతో మహిళలు

కళ్ల ముందే దోచేస్తారు

సాక్షి,మేడ్చల్ జిల్లా: 'పోచారం మార్కెట్‌లో జ్యోతి 500 గ్రాములు (అరకిలో)టమాటాలు కొనుగోలు చేసింది. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేయిస్తే 460 గ్రాములు చూపిస్తోంది. 40 గ్రాములు నష్టపోయారు. ఈసీఐఎల్ -నాగారం రోడ్డులో కిలో జామ కాయలను కొనుగోలు చేయగా, విక్రయదారుడు వాటిని మామూలు త్రాసులో తూకం వేసి ఇచ్చాడు. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేస్తే 890 గ్రాములు మాత్రమే ఉన్నట్లు చూపిస్తోంది. బియ్యం బస్తా 25 కిలోలకు ధర చెల్లిస్తున్నాం. తూకం వేస్తే 24.5 కిలోలు మాత్రమే ఉంటోంది. ఇందులో ఏది నమ్మాలో తెలియక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.

తూకాల్లో మోసాలు

- కిలోకు 50 నుంచి వంద గ్రాముల టోకరా
- దుకాణాలు, సూపర్ మార్కెట్లలోనూ చేతివాటం
- కూరగాయలు, చేపల మార్కెట్లలోనూ అదే పరిస్థితి...

◆ వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. తూకాలు, కొలతల్లో తేడాలు ఉంటున్నా.. చిరునామా లేని చిరుతుండ్లు. ఆహార పదార్థాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. అధికారులు నామమాత్రపు తనిఖీలతో మమ అనిపిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమ వుతున్నాయి.

◆ **కూరగాయల మార్కెట్‌లో...**

గ్రేటర్ సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వారానికి ఒక వాడ, బస్తీ , గ్రామం చొప్పున కూరగాయల అంగళ్లు, చేపల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. అయితే ఇక్కడ తూకాల్లో మోసాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎలక్ట్రానిక్ కాంటా వాడాలని నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు పాత రకపు త్రాసు వాడుతూ బండరాళ్లను తూకానికి ఉపయోగిస్తున్నారు. మార్కెట్లో కొనుగోలు చేసిన కూరగాయలను బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే బరువు తక్కువగా ఉంటోంది.

◆ **చేపల విక్రయాల్లోనూ చేతి వాటం....**

నగరంతో సహా శివారుల్లో చేపల మార్కెట్‌లలో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. లావుపాటి కవర్లలో చేపలు జోకడం, ఎలక్ట్రానిక్ మెషిన్లు కాకుండా పాత రకపు తక్కెడ వాడుతుండటం కనిపిస్తోంది. బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే 100 నుంచి 200 గ్రాముల వరకు తేడా వస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. మరికొందరు ఎలక్ట్రానిక్ యంత్రాన్ని లీటర్ మోడ్‌లో పెట్టి తూకం వేస్తున్నారు. అందులో వెయ్యి గ్రాములు కాకుండా వెయ్యి అని మాత్రమే చూపిస్తుంది. లీటర్ మోడ్‌లో ఉంటే పాలు తీసుకుంటే 1000 (లీటరు) ఎంఎల్ చూపిస్తుంది. ఘన పదార్థం తీసుకుంటే (ఉదా: కిలో చేపలు తీసుకుంటే) 900 అని వస్తోంది. గ్రాములా, లీటర్లో తెలియక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.

◆ **సూపర్ మార్కెట్లలో....**

కిరాణ దుకాణాలు, కొన్ని సూపర్ మార్కెట్లలో ప్యాకెట్ల రూపంలో విక్రయించే వాటిపై తయారీ, నాణ్యతా ప్రమాణాలు, ఇతర వివరాలు ఉండటం లేదు. ఇష్టం వచ్చినట్లు విక్రయిస్తున్నారు. ఏదైనా వస్తువు, ఆహార పదార్థాలకు సంబంధించిన ప్యాకింగ్ పై ఉదాహరణకు 500 కిలో గ్రాముల ప్యాకెట్‌పై అదనంగా 150 గ్రాములు ఇస్తున్నట్లు ముద్రిస్తున్నారు. నిశితంగా పరిశీలించి ఆఫర్ లేక పోగా ధర ఎక్కువగా ఉంటోంది. ఒకటి కొంటే మరొకటి, ఉచితమంటూ బోర్డులపై ప్రదర్శిస్తూ.. బిల్లు మాత్రం రెండింటికి వేస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరంలో అనేక ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు వెలిశాయి. కొందరు వాటిని ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఎలాంటి ప్రమాణాలు పాటించడం లేదు. చిప్స్, కారా, మిఠాయిలు, బిస్కెట్లు, బ్రెడ్డు, కేకులు తదితర ప్యాకెట్లపై ఎలాంటి వివరాలు ఉండటం లేదు. గడువు తీరినా, కల్తీ జరిగినా ఎవరికి ఫోన్ చేయాలో తెలియడం లేదు. కస్టమర్ కేర్ వివరాలు, ఫోన్ నెంబర్ లాంటివి ఉండటం లేదు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో వందల సంఖ్యలో పెట్రోల్ బంకులు ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ పోయించుకునేప్పుడు వాహనదారుడు జీరో రీడింగ్ చూసుకోవాలి. అప్పటికీ పెట్రోల్ తక్కువగా వస్తోందని భావిస్తే తనిఖీ చేసుకోవచ్చు. ప్రతి బంకులో ఐదు లీటర్ల క్యాన్ ఉంటుంది. అందులో ఐదు లీటర్ల పెట్రోలు పోసి పరిశీలించవచ్చు. తక్కువగా వస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలి. కల్తీ జరిగిందని అనుమానం వస్తే వారి వద్ద ఉన్న ఫిల్టర్ పేపర్‌ను అడిగి తీసుకోవాలి. దానిపై రెండు చుక్కలు వేస్తే ఆవిరైపోతుంది. కల్తీ ఉంటే పేపర్‌పై మరక అవుతుంది. ఘన, ద్రవ ఆహార పదార్థాలు ప్యాక్ చేసి విక్రయించాలంటే అనుమతి ఉండాలి. ప్యాకింగ్ పూర్తి వివరాలు, డిక్లరేషన్ ఉండాలి. వినియోగదారులు బిల్లులు అడిగి తీసుకోవాలి.

–జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి సత్యనారాయణ, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా

అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పలు సమస్యలపై ఎమ్మెల్సీకి విన్నవించగా ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్‌లో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. నిజాంపేట్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో ఇటీవలే నిమ్స్‌లో చేరి చికిత్స పొందుతుండగా సంబంధిత డాక్టర్లకు ఫోన్ చేసి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై చర్చకు రాగా దశలవారీగా పనులును పూర్తి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

నాసిరకంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు


గురుమూర్తినగర్‌లో నాసిరకంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు

చింతల్: అభివృద్ధి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నా.. పట్టించుకునే అధికారులు కరువయ్యారు. జలమండలి కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న గురుమూర్తినగర్‌లో రూ.11 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. సదరు పైపులైన్ వేస్తున్న కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గురుమూర్తినగర్ వాసులు ఆరోపిస్తున్నారు. సిమెంట్ ఇటుకలు (హోలో బ్రిక్స్), రోబోసాండ్ పౌడర్ వాడుతూ నాణ్యతకు తిలోదకాలు పలుకుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాణ్యత లోపించి నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు.. పరుగు

జీడిమెట్ల: దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడంపై సుభాష్‌నగర్ డివిజన్ ప్రజలు జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని కాలనీల్లో ఇటీవల దోమలు విపరీతంగా వృద్ధి చెందాయని కాలనీల ప్రజలు అంటున్నారు. దోమలు కుట్టడం వలన కాలనీల్లోని ప్రజలు మలేరియా జ్వరంతో ఇబ్బంది పడతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

◆ కాలనీల్లో రోడ్లపై మురుగునీరు సైతం నిలుస్తుండటంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. మురుగునీరు నిలిచిన చోట సిబ్బంది పట్టించుకుని రోడ్లపై మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దోమల బెడద విపరీతంగా ఉండటం వలన ఈ విషయమై ప్రజలు కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎంటమాలజీ సిబ్బందికి పలుమార్లు తెలిపిన వారు ఫాగింగ్ చేయడం లేదంటున్నారు.


డివిజన్‌లోని ఓ రోడ్డుపై నిలిచిన మురుగు

◆ కాలనీల్లో కనీసం వారానికి మూడు సార్లు ఫాగింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఇళ్లల్లో దోమలు విపరీతంగా వృద్ధి చెంది ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మురుగు సాఫీగా వెళ్లడంతో పాటు ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అల్ఫ్ పర్వతాలపై సాహసయాత్ర విజయవంతం

దుండిగల్: బాచుపల్లిలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు స్విస్ అల్ఫ్ పర్వతాలపై సాహసయాత్ర చేసి అత్యుత్తమ విజయాన్ని సాధించారని ప్రిన్సిపల్ బల్జీత్ ఒబెరాయ్ అన్నారు. పాఠశాలకు చెందిన 16మంది విద్యార్థులు ముగ్గురు ఉపాధ్యాయులతో కూడిన బృందం జూన్ 30న పర్వతారోహణకు యూరప్ వెళ్లారు. సాహసయాత్ర పూర్తి చేసుకుని ఈనెల 14వ తేదీన తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అక్కడ అతి ప్రమాదకరమైన పర్వాతాలను నిపుణుల బృందంతో కలిసి అధిరోహించారని పాఠశాల ఐజీసీఎస్ఈ కోఆర్డినేటర్ షీలా అన్నారు. ఈ సాహసయాత్ర పూర్తి చేసిన విద్యార్థులు వాతావారణ పరిస్థితుల్లోని ప్రతిసవాళ్లను ఏవిదంగా ఎదుర్కోవాలో ఈ సందర్భంగా నేర్చుకున్నారని అన్నారు. యాత్ర పూర్తిచేసుకుని వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం ఘనస్వాగతం పలికారు.


స్విస్ అల్ఫ్ పర్వతారోహణలో బాచుపల్లి ఓక్రిడ్జ్ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

కోవిడ్ పరీక్షలు చేయించుకోండి

జగద్గిరిగుట్ట: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో కోవిడ్ పరీక్షలు తిరిగి చేస్తున్నామని డాక్టర్ నిర్మల తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న వారు అనుమానం ఉంటే సూరారం యూపీహెచ్‌సీ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆదివారం 12మందికి కోవిడ్ పరీక్షలు చేయగా అందరికీ నెగటివ్ వచ్చిందని తెలిపారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

జగద్గిరిగుట్ట: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ముగిసాయి. పూజల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఛైర్మన్ వివేక్‌రెడ్డి, శైలజారెడ్డి దంపతులు ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.